## క్లుప్తంగా

### నేడు బీజేఆర్‌నగర్ బస్తీ ఎన్నికలు

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్ బీజేఆర్ నగర్ బస్తీ ఎన్నికలు ఈ నెల 22 ఆదివారం జరగనున్నాయి. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4 వరకు కొనసాగే ఎన్నికలో సుమారు 500 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. అధ్యక్ష పదవికి ఆరుగురు పోటీ పడుతున్నారని ఎన్నికల రోజు సాయంత్రం ఫలితాలను వెల్లడిస్తామన్నారు.

### పీహెచ్‌డీ కటాఫ్ మార్కులు తగ్గించండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పీహెచ్‌డీ ప్రవేశాలకు కటాఫ్ మార్కులను తగ్గించాలని వీసీ ప్రొ.రవిందర్‌కు శనివారం వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఎస్‌టీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు బైరు నాగరాజుగౌడ్ మాట్లాడుతూ గతంలో మాదిరి బీసీ విద్యార్థులకు 20, ఓసీలకు 25, ఎస్సీ, ఎస్టీలకు అర్హత మార్కులు లేకుండ పీహెచ్‌డీ ప్రవేశాలు కల్పించాలన్నారు. అర్హత మార్కులను పెంచడం వలన వివిధ సబ్జెక్టుల్లో అనేక సీట్లు మిగులుతుయని పేర్కొన్నారు. కటాఫ్ మార్కులను తగ్గించకుంటే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

### పీహెచ్‌డీలో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను పాటించండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పీహెచ్‌డీ ప్రవేశాలకు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు పాటించాలని విద్యార్థి నాయకులు వీసీ, రిజిస్ట్రార్‌కు శనివారం లచ్చిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతిరెడ్డి వినతి పత్రం సమర్పించారు. పీహెచ్‌డీ ప్రవేశ పరీక్ష ఫలితాలలో ఇతర రిజర్వేషన్ విద్యార్థులకు మాదిరి ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు అర్హత మార్కులలో రిజర్వేషన్లను వర్తింపచేయాలన్నారు.

### కరోనాలోనూ మెరుగైన ఫలితాలు

సాక్షి, సిటీబ్యూరో: లాక్‌డౌన్ నేపథ్యంలో ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొన్నప్పటికీ పాఠశాల విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించినట్లు విద్యారంగ సేవల సంస్థ ఎక్స్‌సీడ్ ప్రోగ్రామ్ తేల్చింది. దేశంలో 21 రాష్ట్రాల వ్యాప్తంగా 51 వేల మంది విద్యార్థులతో నిర్వహించిన ఎక్స్‌సీడ్ లెర్నోమీటర్ స్కిల్స్ టెస్ట్ ఫలితాలను శనివారం వెల్లడించింది. విద్యార్థులు కోవిడ్ అనంతర చదువులో 31% మెరుగుదల ప్రదర్శించారని, అంతకు ముందు ఏడాదితో పోలిస్తే ఇంగ్లిష్‌లో 30%, గణితంలో 26%,సైన్స్‌లో 39%,కమ్యూనికేషన్ స్కిల్స్‌లో 47శాతం మెరుగుదల కనిపించింది.

### గూగుల్ ఆధ్వర్యంలో డేటా డైలాగ్ వర్క్‌షాప్

సనత్‌నగర్: గూగుల్ న్యూస్ ఇనిషియేటివ్ ఇండియా ఆధ్వర్యంలో బేగంపేటలోని సెయింట్ ఫ్రాన్సిస్ కళాశాలలో శనివారం డేటా డైలాగ్ వర్క్‌షాప్ నిర్వహించారు. డిజిటల్ యుగంలో సాంకేతిక విప్లవాన్ని దృష్టిలో పెట్టుకుని మీడియా రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా జర్నలిస్టులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా టైమ్స్ ఆఫ్ ఇండియా ఎడిటర్, ప్రముఖ సీనియర్ ఇన్వెస్టిగేషన్ జర్నలిస్ట్ ఉడుముల సుధాకర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. మీడియా రంగంలో పనిచేసే ప్రతి జర్నలిస్టుకు సాంకేతిక పరిజ్ఞానం అత్యంత కీలకంగా మారుతోన్న దశలో దేశవ్యాప్తంగా వర్క్‌షాప్‌లు నిర్వహించడం శుభపరిణామం అన్నారు. డేటా లీడ్స్ సంస్థ ప్రతినిధి పారుల్ గోస్వామి, ప్రముఖ ట్రైనర్ సంగీత ఒబ్రాయ్, రాకేష్‌రెడ్డి దుబ్బుడు, అనిత పాల్గొన్నారు.

### ప్రమాద స్థలాన్ని పరిశీలించిన నాయకులు

రాంగోపాల్‌పేట్: మినిస్టర్‌రోడ్‌లో అగ్ని ప్రమాదం జరిగిన భవనాన్ని తెలంగాణ జన సమితి వ్యవస్థాప అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం పరిశీలించి మాట్లాడారు. ముగ్గురు గల్లంతయ్యారనే వార్తలు వస్తున్నాయని ఎవరైనా చనిపోయి ఉంటే వారి కుటుంబానికి నష్టపరిహారం కింద రూ.50 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సీపీఐ బృందం సైతం ప్రమాద స్థలాన్ని పరిశీలించింది. ఆ పార్టీ నగర కార్యదర్శి నరసింహ మాట్లాడుతూ.. అధికారుల అవినీతి కారణంగానే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయ అక్రమ కట్టడాలు కూల్చివేయడంతో జీహెచ్‌ఎంసీ అధికారులు నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

### జక్కి శ్రీకాంత్‌కు జాతీయ యువజన అవార్డు

బన్సీలాల్‌పేట్: వరంగల్ జిల్లా నల్లబెల్లి గ్రామానికి చెందిన జక్కి శ్రీకాంత్‌కు జాతీయ యువజన అవార్డు వరించింది. శ్రీకాంత్ చేసిన సామాజిక సేవా కార్యక్రమాలకు గాను కేంద్ర యువజన సర్వీసుల మంత్రిత్వశాఖ ఆయనకు జాతీయ యువజన అవార్డుకు ఎంపిక చేసింది. ఇటీవల కర్నాటక ధార్వాడ్‌లో జరిగిన జాతీయ యువజన వారోత్సవాల్లో ఆ రాష్ట్ర గవర్నర్ తావల్ చంద్ గెహ్లాట్, సీఎం బసవరాజుబొమ్మై, కేంద్ర మంత్రులు అనురాగ్ ఠాగూర్, ప్రహ్లాద్ జోషి చేతుల మీదుగా జక్కి శ్రీకాంత్ అవార్డును అందుకున్నారు. అవార్డు అందుకున్న శ్రీకాంత్‌ను రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ ముఖ్య కార్యదర్శి సబ్యసాని ఘెష్ ఘనంగా సత్కరించి అభినందించారు.

# ఆద్యంతం.. ఆలోచింపజేసేలా!

- హెచ్‌పీఎస్‌లో అలరిస్తున్న సైన్స్ ఫెస్టివల్
- వివిధ ప్రదర్శనలిచ్చిన విద్యార్థులు
- అభినందించిన నిర్వాహకులు

బేగంపేటలోని హెచ్‌పీఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా జరుగుతున్న ఇండియా సైన్స్ ఫెస్టివల్ (ఐఎస్‌ఎఫ్)లో వైజ్ఞానిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులతో పాటు ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థలు ప్రత్యేకంగా స్టాళ్లను ఏర్పాటుచేసి అధునాతన సాంకేతికతతో రూపొందించిన నమూనాలను ప్రదర్శించి ఆలోచింపజేశారు. సైన్స్ ఫెస్టివల్‌కు తరలిరావడంతో హెచ్‌పీఎస్ కోలాహలంగా మారింది. – సనత్‌నగర్

### డీఎన్‌ఏ పరీక్ష విధానం..

సెంటర్ ఫర్ డీఎన్‌ఏ ఫింగర్‌ప్రింటింగ్ అండ్ డయాగ్నస్టిక్స్ (సీడీఎఫ్‌డీ) ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్టాల్ ద్వారా డీఎన్‌ఏ పరీక్ష ఏ విధంగా చేస్తారో వివరించే స్టాల్ ఆకట్టుకుంది. తల వెంట్రుకలు, ఫ్యూమర్ బోన్, స్వాబ్, బ్లడ్ స్టెయిన్స్, పళ్లు..ఇలా ఒంట్లోని అవయవాల ఆధారంగా డీఎన్‌ఏ పరీక్ష చేసి అది ఎవరిదో ఎలా గుర్తిస్తారనే విషయాన్ని తెలిపారు. గతంలో జరిగిన ఎన్నో ఘటనల్లో శరీర భాగాలను సేకరించి సీడీఎఫ్‌డీ ద్వారా ఛేదించిన కేసులను సీడీఎఫ్‌డీ ప్రతినిధులు వివరించి డీఎన్‌ఏ ప్రాధాన్యతను చాటి చెప్పారు.



### రైతులకు బహువిధాలా మేలు..

తెలంగాణ స్టేట్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్ విద్యార్థులు..రైతులకు బహువిధాలుగా ఉపయోగపడేలా తయారుచేసిన యంత్రం ఆకట్టుకుంది. చక్రాలతో రూపొందించిన ఈ యంత్రం ద్వారా రైతు నడ్డిపై ఎలాంటి బరువు లేకుండా సులభంగా పంటకు మందులను పిచికారీ చేయవచ్చు. అలాగే కల్లంలోని ధాన్యాన్ని మనషుల సహాయం లేకుండా ఒక్కరే బస్తాల్లోకి నింపవచ్చు. అదే విధంగా ధాన్యాన్ని నింపిన బస్తాలను దాని పైనే వేరే చోటికి తరలించవచ్చు. ఇన్ని రకాలుగా ఉపయోగపడేవిధంగా యంత్రాన్ని రూపొందించిన విద్యార్థులను సందర్శకులు అభినందించారు. చేతులతో స్విచ్ ఆన్ చేసే అవసరం లేకుండా శబ్దంతోనే మోటార్ పనిచేయడం ద్వారా విద్యుదాఘాతాల నుంచి రైతులను కాపాడవచ్చనే కాన్సెప్ట్‌తో దీనిని రూపొందించారు.



### బ్యాక్టీరియా, వైరస్‌పై..

సీసీఎంబీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్టాల్స్ బ్యాక్టీరియా, వైరస్‌ల నుంచి ఆరోగ్యాన్ని ఏవిధంగా కాపాడుకోవచ్చో విద్యార్థులకు తెలియజేసింది.కోవిడ్ సమయంలో ఉత్పన్నమైన పరిస్థితుల దృష్ట్యా ఆల్ఫా, డెల్టా, ఒమిక్రాన్ వంటి వివిధ రకాల వేరియంట్లతో పాటు టీబీ నుంచి ఏవిధంగా కాపాడుకోవాలో వివరించారు. ఒకరి నుంచి మరొకరికి ఏవిధంగా వ్యాపిస్తోంది, వాటి నుంచి రక్షణ పొందేందుకు నిర్దేశించిన మార్గాలను సందర్శకుల ముందు ఆవిష్కరించారు.

### గాలి వైబ్రేషన్ శబ్దాలు భళా..



బెలూన్ నుంచి గాలి బయటకు పంపేటప్పుడు ఒక వైబ్రేషన్..అదే బెడ్ మాదిరిగా ఉండే ట్యూబ్ నుంచి వెలువడే గాలి వైబ్రేషన్ శబ్దం ఏ విధంగా ఉంటుందో సైన్స్ మేడ్ సింపుల్.కో.యూకే ప్రతినిధి ఆసక్తికరంగా డెమో నిర్వహించి సైన్స్ ప్రాముఖ్యతను తెలియజేశారు. చిన్నారులతోనే ప్రాక్టికల్‌గా చేయించి వారికి సైన్స్ అంటే ఏమిటో తెలియపరిచిన తీరు అబ్బురపరిచింది.

### చీడ పురుగులను స్వతహాగా ఎదుర్కొనేలా

సీసీఎంబీ ఏర్పాటుచేసిన మరో స్టాల్స్‌లో చీడ పురుగుల నుంచి పంటను ఏవిధంగా కాపాడుకోవచ్చో తెలియజేసిన తీరు ఆలోచింపజేసింది. బ్యాక్టీరియా, చీడ పురుగులు పంటను పట్టినప్పటికీ స్వతహాగా పంటకు హాని కలగకుండా రసాయనాలను విడుదల చేసుకునే వరి వంగడాలను సృష్టించడం జరిగిందని సీసీఎంబీ ప్రతినిధులు చెప్పుకొచ్చారు. అలాంటి వాటిల్లో ఇప్రూవుడ్ సాంబా మసూరి ఒకటన్నారు. ఈ వంగడం చీడను ఎదుర్కొనే రసాయనాలను స్వతహాగా విడుదల చేసి పంటకు ఎలాంటి హాని జరగకుండా ఉంటుంది.

### ప్లాస్టిక్ రీసైకిల్.. కొత్త ఉత్పత్తుల తయారీ..



తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్ విద్యార్థులు ప్లాస్టిక్ రీసైకిల్ విధానం సులభంగా ఏ విధంగా చేయవచ్చో తమ నమూనా ద్వారా తెలిపిన తీరు అబ్బురపరిచింది. అప్పటికప్పుడు ప్లాస్టిక్‌ను రీసైకిల్ చేయడం ప్రాక్టికల్‌గా చూసి సందర్శకులు ముగ్ధులయ్యారు. అదే విధంగా అదే సంస్థకు చెందిన విద్యార్థులు వరి పంటకు ఎంత నీరు అవసరమో అంతే నీటిని భూమి తీసుకునే విధంగా ఐఓటీ బేస్డ్ స్మార్ట్ ఇరిగేషన్ మానిటరింగ్ సిస్టమ్‌ను రూపొందించి ఆలోచింపజేశారు.

## ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి పాటుపడాలి



కిట్స్‌ను పంపిణీ చేస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

లాలాపేట: ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ పాటు పడాలని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గం శాంతినగర్‌లోని నఫీజ్ గార్డెన్‌లో శనివారం అటల్ బిహారీ వాజ్‌పేయి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రైమ్ మినిస్టర్ హెల్తీ బేబీ షో–2023లో ఆయన పాల్గొని 3–13 నెలల చిన్నారులకు హెల్త్ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే కేంద్ర ప్రభుత్వం ధ్యేయం అన్నారు. నేటి బాలలే రేపటి పౌరులు కాబట్టి వారి ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు, సమాజం సరైన శ్రద్ధ తీసుకోవాలనే ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే దీని ఉద్దేశం అన్నారు. పిల్లలకు తల్లిపాలే శ్రేష్ఠమైన ఆహారం, సరైన సమయంలో టీకాలు ఇప్పించడంపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో కావ్య కిషన్‌రెడ్డి, మాజీ మేయర్ బండ కార్తీకరెడ్డి, నాయకులు బండ చంద్రారెడ్డి, శ్యామ్‌సుందర్‌గౌడ్, వీరన్న, అనిత, సత్యవతి, రాము వర్మ, నాగేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్‌చారి పాల్గొన్నారు.

### అనారోగ్యంతో యువకుడి మృతి

అమీర్‌పేట: ప్రైవేటు హాస్టల్‌లో ఉంటున్న ఓ యువకుడు మృతి చెందిన ఘటన ఎస్‌ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ వివరాల ప్రకారం.. ఈస్ట్ గోదావరి జిల్లా వర్సలేరుకు చెందిన ఎస్.యోగి (19) బల్కంపేట రోడ్డులోని ఎస్‌బీవీఎస్ హాస్టల్‌లో పనిచేస్తూ అక్కడే ఉంటున్నాడు. శుక్రవారం ఉన్నట్టుండి ఊపిరి తీసుకోవడంలో ఇబ్బందులు తలెత్తగా నిర్వాహకుడు వెంకయ్య ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. యోగి గతకొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలిపారు. కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చిన వెంటయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

## వసతుల కల్పనకు నిధుల కొరత ఉండదు




అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న సాయన్న

రాంగోపాల్‌పేట్: మోండా మార్కెట్ డివిజన్‌లో మౌలిక సదుపాయాల కల్పన ఎలాంటి నిధుల కొరత లేకుండా పనులు పూర్తి చేస్తామని కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్న అన్నారు. శనివారం రెజిమెంటల్‌బజార్‌లోని సలూజ నర్సింగ్ హోం వద్ద రూ.23లక్షలు, జూలమ్మ బస్తీలో రూ.16 లక్షలతో డ్రైనేజీ పనులు, సెబాస్టియన్ రోడ్‌లో రూ.36 లక్షల వ్యయంతో చేపట్టనున్న రోడ్డు పనులను శనివారం ఆయన కార్పొరేటర్ కొంతం దీపికతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మౌలిక సదుపాయాల కల్పనలో యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధి పనులు చేపట్టి సమస్యలు పరిష్కరిస్తామని హామి ఇచ్చారు. రెజిమెంటల్‌బజార్‌లో కలుషిత జలాలు, మురుగు నీటి సమస్య, మంచినీటి లో ప్రెషర్ సమస్యలన్నీ పరిష్కారం అవుతాయన్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా అభివృద్ధి పనులను పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ రవీందర్, నాయకులు నరసింహరావు ముదిరాజ్, చిన్న, కసిరెడ్డి నరేందర్, అజయ్, సంతోష్ పాల్గొన్నారు.

### ఆస్పత్రుల్లో పరిశుభ్రత పాటించాలి

అమీర్‌పేట: నగరంలోని మలక్‌పేట ప్రభుత్వ ఆసుపత్రిలో ఇన్‌ఫెక్షన్ కారణంగా గర్భిణులు మృతి చెందిన నేపథ్యంలో అధికారులు అప్రమత్తమైయ్యారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కారాదనే ఉద్దేశ్యంతో అందుకు తగ చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా శనివారం తెలంగాణ వైద్య విధాన పరిషత్ అధికారులు అమీర్‌పేట ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. కమిషనర్ అజేయ్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య బృందం సభ్యులు ఆసుపత్రిలోని ల్యాబ్, వార్డులను పరిశీలించి వైద్యులకు పలు సూచనలు చేశారు. వైద్య పరీక్షలకు ఉపయోగపడే పరికరాలను ఎప్పటికప్పు కడిగి శుభ్రంగా పెట్టుకోవాలన్నారు. అత్యవసరంగా ఏదైనా అవసరమైతే కొనుగోలు చేసుకునేందుకు వీలుగా రూ.2 లక్షలు కేటాయించినట్లు సూపరింటెండెంట్ దశరథ్ తెలిపారు. ఈ సమావేశంలో డీసీహెచ్‌ఎస్ సునీత, ఆర్‌ఎంఓ వినాయకరావు, తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక అంశాలపై అవగాహన అవసరం



పలు అంశాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై నరేష్

చిలకలగూడ: సామాజిక అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైన ఉందని చిలకలగూడ ఎస్‌ఐ నరేష్ అన్నారు. విజ్ఞాన భారతి పాఠశాలలో శనివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి విద్యార్థులు, అధ్యాపకులకు కమ్యూనిటీ పోలీసింగ్, డయల్ 100, ర్యాష్, మైనర్ డ్రైవింగ్, ఉమెన్‌సేఫ్టీ, సైబర్‌క్రైం, ఆన్‌లైన్ చీటింగ్, మాదకద్రవ్యాలతో కలిగే అనర్థాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. లాటరీలు గెలుచుకున్నట్లు, గిఫ్ట్‌లకు ఎంపికైనట్లు వచ్చే మెసేజ్‌లు, అపరిచితుల నుంచి వచ్చే ఈ–మెయిల్స్‌కు స్పందించ రాదన్నారు. ఫోన్లను ఎక్కువ వాడటంతో అనేక రుగ్మతలు వచ్చే అవకాశం ఉందని, శారీరక, మానసికంగా దృఢంగా ఉండేందుకు ప్రతిరోజు వ్యాయామం చేయాలన్నారు. ఉన్నతమైన విద్యను అభ్యసించి ఉత్తమపౌరులుగా మారాలన్నారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేసి సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ ఎస్‌ఐ నరేష్, కానిస్టేబుళ్లు అనీల్, శివరామ్, కుమార్, రాజు పాల్గొన్నారు.

### డ్రగ్స్‌తో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలి

కుషాయిగూడ: డ్రగ్స్ దూరంగా ఉండేలా చిన్ననాటి నుంచే అవగాహన కల్పించాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య ఆర్.లింబాద్రి అన్నారు. ధర్మసేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం చర్లపల్లి పారిశ్రామికవాడలోని సీఐఏ ఆడిటోరియంలో నిర్వహించిన యువత– సాధికారత సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డగ్స్‌తో పాటు సైబర్ నేరాలకు యువత పాల్పడుతున్న ఘటనలు తరచూ చోటుచేసుకోవడం బాధాకరం అన్నారు. యువతలో చైతన్యం నింపేందుకు ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలకు మద్దతుగా పనిచేయాలన్నారు. సీఐఏ అధ్యక్షుడు గోవిందారెడ్డి, నిషాంత్ రెడ్డి, ధీర, రమణి, వికాస్, భారత్, మనిందర్, జైనిక్ పాల్గొన్నారు.

## వాలీబాల్ జాతీయ జట్టుకు టీటీడీ విద్యార్థి



శివకృష్ణను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

కంటోన్మెంట్: న్యూ బోయిన్‌పల్లి ఓల్డ్ ఎయిర్ పోర్ట్ రోడ్‌లోని టీటీడీ వేంకటేశ్వర వేదాంత వర్ధిని సంస్కృత కళాశాల విద్యార్థి సుంకరి హరికృష్ణ అంతర్జాతీయ స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌కు ఎంపికయ్యారు. బీఏ మొదటి సంవత్సరం చదువుతున్న శివకృష్ణ నేపాల్‌లో జరిగిన నాలుగో అంతర్జాతీయ వాలీబాల్ టోర్నమెంట్‌లో భారత జట్టు తరపున ప్రాతినిధ్యం వహించాడు. టోర్నీ ముగించుకుని కళాశాలకు వచ్చిన శివకృష్ణను ప్రధానాచార్యులు బానోతు సురేంద్ర, ఏఈఓ నందిని తోటి విద్యార్థులు అభినందించారు.

## రసాభాసగా వాకర్స్ అసోసియేషన్ సమావేశం

అమీర్‌పేట: సనత్‌నగర్ కేఎల్‌ఎన్‌వై పార్కు వాకర్స్ అసోసియేషన్ సమావేశం రసాభాసగా జరిగింది. పార్కులో చేపట్టనున్న అభివృద్ధి పనులపై చర్చించేందుకు అధ్యక్షులు షాబాద్ శ్రీనివాస్‌రావు అధ్యక్షతన శనివారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కాగా ప్రస్తుత కమిటీ పదవీ కాలం ముగిసిందని కొత్త కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అయితే కమిటీలో పదవుల కోసం చాలా మంది పోటీ పడుతున్న నేపథ్యంలో ముందుగా వాకర్స్‌కు సభ్యత్వాలను ఇచ్చి కమిటీని ఎన్నుకుంటామని ప్రస్తుత కమిటీ సభ్యులు స్పష్టం చేశారు.గతంలో ఎలాగైతే కమిటీని ఎన్నుకున్నారో అదే తరహా కొత్త కమిటీని ఎన్నుకోవాలని ఓటింగ్ ప్రక్రియను తీసుకురావద్దని పట్టుపట్టారు.ఇందుకు అసోసియేషన్ నాయకులు అంగీకరించకపోవడంతో సమావేశం కాస్త రసాభాసగా మారింది. సభ్యత్వాలు చేయాల్సిందేనంటూ అసోసియేషన్ నాయకులు అక్కడి నుండి వెళ్లిపోయారు.ఇదే సమయంలో రమేష్‌గౌడ్‌ను తాము అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకుంటున్నామంటూ తమకు తామే ప్రకటించుకుని సన్మానాలు చేసుకుని సామాజిక మాధ్యమాల్లో పోస్టింగ్‌లు పెట్టి ప్రచారాలు చేసుకుంటున్నారంటూ ఆరోపించారు. ఇదిలా ఉండగా ఈ నెల 27 నుంచి 31 వరకు వాకర్స్ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపడుతున్నట్లు షాబాద్ శ్రీనివాస్‌రావు తెలిపారు.నూతన కమిటీని ఎన్నుకున్నట్లు కొందరు ప్రచారం చేస్తుకుంటున్నారని, అది అసోసియేషన్‌కు సంబంధం లేదన్నారు.

## ఉచిత వైద్య శిబిరానికి స్పందన



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు



మందులు అందజేస్తున్న బీజేపీ నాయకులు

అడ్డగుట్ట: పేద, మధ్య తరగతికి ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని బీజేపీ నాయకులు మద్దెర్ల శ్యామ్ సుందర్ అన్నారు. శనివారం అడ్డగుట్టలోని అంజయ్య విగ్రహం వద్ద బీజేపీ మెడికల్ సెల్ తెలంగాణ సహకారంతో నిర్వహించిన వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించిన అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశామన్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూ.. పార్టీ అధిష్ఠానం మేరకు నగర వ్యాప్తంగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. పేద ప్రజలందరూ ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆదివారం (నేడు) కూడా అడ్డగుట్టలో వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సురేందర్, నేతలు మంద అశ్విని సురేష్, సాయి బాబా, నరేందర్, నర్సింగ్, ఉదయ్ యాదవ్, శివాజీ, శ్యామల, నందు, యాదగిరి, మహేందర్ పాల్గొన్నారు.

### ముత్తూట్ ఆరోగ్య సంచారిణి ఆధ్వర్యంలో..

రసూల్‌పురా: కంటోన్మెంట్ బోర్డు రసూల్‌పురా ఇందిరమ్మనగర్‌లో శనివారం ముత్తూట్ ఆరోగ్య సంచారిణి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సంస్థ మేనేజర్ లక్ష్మి నారాయణ మాట్లాడుతూ.. జంట నగరాల్లో పేదలు అధికంగా నివసించే బస్తీల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి కార్పొరేట్ వైద్య సేవలు అందజేస్తున్నామన్నారు. శిబిరంలో హాజరైన వారికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించిన అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశామన్నారు.తాము నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరానికి క్రియా సంఘం సొసైటీ ప్రధాన కార్యదర్శి షేక్ నయిం సహకారం అందజేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ మాజీ చైర్మన్ టీఎన్. శ్రీనివాస్, ల్యాబ్ టెక్నిషియన్ సుజాత, వెంకటేష్. రాకేష్, యూసుఫ్, బాలు, దీప, డేబురా, నర్సింహ, నాగరాజు, శివ, మహేష్, సురేష్ పాల్గొన్నారు.

## గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తి రిమాండ్

సికింద్రాబాద్: విశాఖపట్నం నుంచి ఉత్తరప్రదేశ్ రాష్ట్రం మధురకు గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్న వ్యక్తిని రిమాండ్‌కు తరలించారు. జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీను వివరాల ప్రకారం.. జీఆర్‌పీ ఎస్‌ఐ మాజిద్ నేతృత్వంలో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ 1వ నెంబర్ ప్లాట్‌ఫాంపై తనిఖీలు నిర్వహిస్తున్నండగా అనుమానాస్పదంగా లగేజీతో ఉన్న ఓ క వ్యక్తిని తనిఖీ చేయగా 20 కిలోల గంజాయి ప్యాకెట్లు బయటపడ్డాయి. పోలీసుల విచారణలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఫిరోజాబాద్ జిల్లాకు చెందిన శీలేంద్రకుమార్ (33) అనే వ్యక్తి విశాఖపట్నం అటవీ ప్రాంతంలో గంజాయి కొనుగోలు చేసినట్టు చెప్పాడు. ఎక్స్‌ప్రెస్ రైలులో విశాఖ నుంచి సికింద్రాబాద్‌కు చేరుకుని అక్కడి నుంచి మధుర వెళ్లేందుకు రైల్వేస్టేషన్‌లో వేచిచూస్తున్న సమయంలో పోలీసులకు పట్టుబడ్డాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

### కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.19, నల్ల వంకాయ 23, పొడుగు వంకాయ 28, బెండకాయ 57, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 45, క్యాప్సికమ్ 55, పచ్చకాకర 38, పందిరిబీర 45, క్యాబేజీ 10, క్యారెట్ 23, దొండ 45, గుండుబీన్స్ 35, గింజ చిక్కుడు 60, గోకరకాయ 45, కీర 28, దోసకాయ 37, బీట్‌రూట్ 17, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 21, చామగడ్డ 70, మొరంగడ్డ 35, కందగడ్డ 20.






## గ్లోబల్ మార్కెట్‌లో 'మేక్ ఇన్ ఇండియా' పురోగతి




సాక్షి,సిటీబ్యూరో: 'మేక్ ఇన్ ఇండియా' విజన్‌ను కొనసాగించేలా తపస్య–ప్రోకెమ్ సంస్థల విలీనం మరింత వృద్ధిని సాధించడానికి నాందిగా మారనుందని ప్రముఖ గ్రాన్యులేషన్ సంస్థ తపస్య మేనేజింగ్ డైరెక్టర్ దేవ్ బక్షి తెలిపారు. వివిధ డొమైన్ల కోసం ఏపీఐ పౌడర్ హ్యాండ్లింగ్ సొల్యూషన్స్‌లో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ప్రోకెమ్ ఫార్మా, గ్రాన్యులేషన్‌లో ప్రసిద్ధిగాంచిన ఫార్మాస్యూటికల్, న్యూట్రాస్యూటికల్ పరిశ్రమలకు సాలిడ్ ఫార్ములేషన్‌లను అందించే తపస్య సంస్థతో విలీనమైంది. దీనికి సంబంధించిన ఆవిష్కరణ కార్యక్రమాన్ని బేగంపేట్‌లోని హోటల్ తాజ్ వివంతా వేదికగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రోకెమ్ డైరెక్టర్ శశి రాయ్ మాట్లాడుతూ.. ఫార్మాతో పాటు ఇతర దేశీయ మార్కెట్లలో భారత్ తన నాయకత్వాన్ని ఏకీకృతం చేస్తూ వినూత్న పరిష్కారాల కోసం కృషి చేస్తుందన్నారు. తపస్యకు ఫార్మా, ఎఫ్‌ఎంసీపీ పరిశ్రమలలో ప్రత్యేక బలాలతో పాటు సిజోనెరిస్ గ్లోబల్ మార్కెట్‌లో ప్రత్యేకత సాధించుకుందని పేర్కొన్నారు. అతిపెద్ద ఔషధ ఎగుమతిదారులలో భారత్ పురోగమిస్తుందని, పరిమాణం పరంగా ప్రపంచ ఫార్మా ఉత్పత్తిలో మూడవ వంతు వాటాను కలిగి ఉందని తపస్య మేనేజింగ్ డైరెక్టర్ దేవ్ బక్షి అన్నారు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రోకెమ్ బిజినెస్ హెడ్ నితేష్ శ్రీవాస్తవ్‌తో పాటు ప్రముఖ పారిశ్రామిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.